సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
శుక్రవారం | 16 | ఆగస్టు | 2024



**ఇంటి భోజనానికి గుర్తింపు**

నర్సంపేట పట్టణంలోని ఉప్పలయ్య హోటల్‌కు భారత సర్కారు గుర్తింపు లభించింది. దీంతో హోటల్ పేరు సామాజిక మాధ్యమాల్లో మార్మోగుతోంది. - 8లో▸



**ప్రాణాపాయం నుంచి గట్టెక్కారు..**

పిల్లలు కారులో ఉండగా డోర్ లాక్ కావడంతో అర్ధగంటకు పైగా భయానక వాతావరణం నెలకొంది. మెకానిక్ వచ్చి డోర్‌లు తెరవడంతో ఊపిరి పీల్చుకున్నారు. - 8లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
34.2°/24.1°

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### గోప్యంగా ఉద్యానవన టెండర్లు

**వరంగల్ అర్బన్:** గ్రేటర్ వరంగల్ ఉద్యాన వన విభాగంలో టెండర్లను గోప్యంగా నిర్వహిస్తున్నట్లు కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టెండర్ నిబంధనలను విస్మరిస్తూ నోటిఫికేషన్ ఇస్తున్నారని విమర్శిస్తున్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి కేయూసీ క్రాస్ రోడ్డు వరకు రూ.28లక్షలతో సెంట్రల్ డివైడర్ టెండర్‌పై కాంట్రాక్టర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకే సమయం కేటాయించడం సరికాదంటున్నారు. గతంలో టెండర్ల దాఖలుకు సమయం ఇవ్వడం ఎప్పుడూ లేదంటున్నారు. దీనిపై బల్దియా ఉద్యానవన అధికారి రమేశ్‌ను వివరణ కోరగా.. నిబంధనల మేరకు టెండర్ నోటిఫికేషన్ జారీ చేశామని పేర్కొన్నారు.

### 'జూడా'ల మానవహారం



**ఎంజీఎం:** కోల్‌కతాలోని మెడికల్ కళాశాల విద్యార్థినిపై అత్యాచారం, హత్య చేసిన వారిని శిక్షించాలని ఆందోళన చేస్తున్న వారిపై దుండగులు దాడి చేయడాన్ని 'జూడా' ప్రతినిధులు తీవ్రంగా ఖండించారు. వైద్యవిద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ.. కేఎంసీలో వైద్యవిద్యార్థులు చేస్తున్న ఆందోళన గురువారం కూడా కొనసాగింది. ఎంజీఎంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. మధ్యాహ్నం ఎంజీఎం జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

### పాపన్న జయంతి ఉత్సవాల కన్వీనర్‌గా వేణుగోపాల్



**హన్మకొండ:** సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాల కన్వీనర్‌గా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. తనను కన్వీనర్‌గా నియమించడంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అందరినీ కలుపుకుని వెళ్తానని పేర్కొన్నారు.

### నేడు జేఎల్‌ఎం పదోన్నతుల ఉత్తర్వులు

**హన్మకొండ:** టీజీ ఎన్పీడీసీఎల్‌లో విద్యుత్ ఉద్యోగుల ప్రక్రియ రోజుకో మలుపు తిరుగుతోంది. విద్యుత్ జూనియర్ లైన్‌మెన్ పదోన్నతుల ఉత్తర్వుల జారీ ఈనెల 17కు వాయిదా పడింది. టీజీ ఎన్పీడీసీఎల్‌లో జూనియర్ లైన్‌మెన్లకు అసిస్టెంట్ లైన్‌మెన్లకు పదోన్నతులు కల్పించాలని యాజమాన్యం సంకల్పించింది. ఈమేరకు ఈనెల 14న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఎన్పీడీసీఎల్‌లోని ఆపరేషన్ డివిజనల్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 15న మధ్యాహ్నం 2 గంటల వరకు పదోన్నతులు కల్పించి అదే రోజు సాయంత్రం 5 గంటల వరకు జాయిన్ కావాలని ఆదేశించారు. ఈప్రక్రియను మరో రోజుకు వాయిదా వేశారు. అర్హులైన జూనియర్ లైన్‌మెన్‌లందరికీ సరిపడా అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టులుండడంతో సత్ప్రవర్తన కలిగిన ప్రతీ జేఎల్‌ఎం పదోన్నతి పొందనున్నారు. దీంతో సీనియార్టీ, రిజర్వేషన్ వంటి అంశాల జోలికి వెళ్లకుండానే అందరికీ పదోన్నతులు లభిస్తున్నాయి. శుక్రవారం జూనియర్ లైన్‌మెన్లకు పదోన్నతుల ఉత్తర్వులు జారీ చేసి అదే రోజు జాయిన్ కావాలని గురువారం సీఎండీ నుంచి డివిజనల్ ఇంజనీర్లకు ఆదేశాలు అందాయి. ప్రస్తుతం పని చేస్తున్న చోటే పదోన్నతి కల్పించనునండడంతో జాయినింగ్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని అధికారులు తెలిపారు.

### కమిషనరేట్‌లో పంద్రాగస్టు



**వరంగల్ క్రైం:** వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో గురువారం 78వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పరిపాలనా విభాగం భవన ప్రాంగణంలో సీపీ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ అధికారులు, సాయుధ బలగాల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా సీపీ అందరికీ స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు.

హనుమకొండ, వరంగల్‌లో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు







# మాటంటే.. మాటే..

## ఆరు గ్యారంటీల అమలే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- ప్రతీ పేదవాడికి ప్రభుత్వ పథకాలు
- రైతు రుణమాఫీ ఇందుకు నిదర్శనం
- రూ.500కే గ్యాస్ సిలిండర్
- ఇందిరమ్మ రాజ్యం వచ్చింది.. ఇళ్లు వస్తాయి
- 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయశాఖ మంత్రి సురేఖ



మంత్రి కొండా సురేఖ



జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం చేస్తున్న రాష్ట్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝూ తదితరులు

**హన్మకొండ అర్బన్:** రాష్ట్రంలో అర్హులైన ప్రతీ పేదవాడికి పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆడిన మాట తప్పకుండా ఆరు గ్యారంటీలు అమలు చేసి ప్రజలకు ఇందిరమ్మ రాజ్యం ద్వారా ప్రజాపాలన అందిస్తామని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం హనుకొండలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పరేడ్ వందనం స్వీకరించి ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. రుణమాఫీలో రూ.లక్ష, రూ.లక్షన్నర ఉన్న రైతులకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసినట్లు తెలిపారు. మూడో విడత కూడా ప్రారంభమైందన్నారు. మహాలక్ష్మి పథకంలో ఉచిత బస్సు ప్రయాణం విజయవంతంగా అమలు చేస్తున్నామని, జిల్లాలో 171 ప్రాంతాలకు 416 సర్వీసులు నడుపుతున్నట్లు వివరించారు. రూ.500కే గ్యాస్ పథకం అమలు విషయంలో ఇబ్బందులు, అపోహలకు తావులేకుండా సంబంధిత కంపెనీలకు ముందస్తుగా చెల్లింపులు చేయనున్నట్లు వెల్లడించారు. త్వరలో మహిళలకు రూ.2500 అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

### 2023 నుంచి ఆరోగ్యశ్రీ..

హనుమకొండ జిల్లాలో 2023, డిసెంబర్ 9నుంచి రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించామని, జిల్లాలో 5 ప్రభుత్వ, 37 ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఈ పథకం విజయవంతంగా అమలవుతోందన్నారు. విద్యావ్యవస్థ పటిష్టం చేసే క్రమంలో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. జిల్లాలో అర్బన్ ప్రాంతం ఎక్కువగా ఉన్నప్పటికీ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా 12 మండలాలు.. 208 గ్రామాల్లో 19.70 లక్షల పని దినాల లక్ష్యానికిగాను 17.75లక్షల పనిదినాలు కల్పించి రూ.42.71 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. అదేవిధంగా పశు సంవర్థక, మత్స్యశాఖలు, పెన్షన్లు మెప్మా, 'కుడా' ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించారు.

### విజయవంతంగా వన మహోత్సవం..

అటవీశాఖ ద్వారా 17లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా, వన మహోత్సవం కార్యక్రమం ద్వారా 14లక్షల మొక్కలు నాటినట్లు మంత్రి తెలిపారు. 100 హెక్టార్లలో కంపా, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో అటవీ పునరుజ్జీవ పనులు చేపట్టినట్లు చెప్పారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించిన మంత్రి స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలను సముచిత రీతిలో సత్కరించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందించి ఉత్తములుగా ఎంపికైన వారికి ప్రశంసపత్రాలు అందజేశారు. ప్రభుత్వ పథకాలు తెలిపేలా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, గ్రేటర్ మేయర్ గుండు సుధారాణి, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# సమగ్రాభివృద్ధే లక్ష్యం

## వరంగల్ నగరంపై సీఎం ప్రత్యేక దృష్టి

- రూ.80 కోట్లతో కలెక్టరేట్ నిర్మాణ పనులు
- సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనుల్లో వేగం
- రూ.17.90 కోట్లతో 452 పాఠశాలల్లో వసతులు
- స్వాతంత్ర్య దినోత్సవంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- ఖుష్‌మహల్‌లో ఘనంగా పంద్రాగస్టు వేడుకలు



ఖిలావరంగల్‌లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ సత్య శారద, ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్



ప్రసంగిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

**ఖిలా వరంగల్:** వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, ఐఅండ్‌పీఆర్, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. ఖిలావరంగల్ మధ్య కోటలోని ఖుష్‌మహల్ ప్రాంగణంలో గురువారం కలెక్టర్ సత్య శారద అధ్యక్షతన 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరంగల్‌లో రాహుల్‌గాంధీ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌కు కట్టుబడి రుణమాఫీ అమలు చేస్తున్నట్లు చెప్పారు.

### సాగునీటికి ప్రాధాన్యం..

రాష్ట్రప్రభుత్వం సాగునీటికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఎస్సారెస్పీ స్టేజ్–1, 2 ద్వారా 72 వేల ఎకరాలకు సాగునీరు, పాకాల ద్వారా 18,193 ఎకరాలు, 815 చెరువుల కింద ఖరీఫ్‌లో 65, 895 ఎకరాలు, రబీలో 45 వేల ఎకరాలకు సాగునీరు అందించామని వివరించారు. దివంగత సీఎం రాజశేఖరరెడ్డి నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లే జిల్లాలో కనిపిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. అర్హులకు రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలన్న లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు జిల్లాలో నైపుణ్యాభివృద్ధి కళాశాల ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. రూ.17.90 కోట్లతో 452 పాఠశాలల్లో వసతులు కల్పించామని చెప్పారు.

### ఓరుగల్లుపై ప్రత్యేక దృష్టి..

వరంగల్ నగర అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారని, రాష్ట్రానికి రెండో రాజధానిగా అభివృద్ధి చేయాలని, హైదరాబాద్‌కు దీటుగా నగరాన్ని అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి చెప్పారు. ఫార్మా సిటీ, ఐటీ, మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు, ఎకో టూరిజం తదితర అన్ని అంశాలు ఉండేలా మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తున్నామని తెలిపారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి కృషి చేస్తామని, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచామని చెప్పారు. నగరాన్ని వరద ముప్పు నుంచి కాపాడేందుకు నాలాలను విస్తరిస్తున్నామని వివరించారు. కాకతీయుల కాలం నాటి ఆలయాలను పునరుద్ధరిస్తామని వివరించారు. వచ్చే నెల 9న కాళోజీ కళాక్షేత్రాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామని, రూ.80 కోట్లతో కలెక్టరేట్ నిర్మిస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేశారు.

### స్వాతంత్ర్య సమరయోధులకు ఘన సన్మానం..

కలెక్టర్ సత్య శారద, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ రవీందర్‌తో కలిసి మంత్రి పొంగులేటి శాలువాలు కప్పి పూలమాలలతో స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు. కల్లుగీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచాలను పంపిణీ చేశారు. ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, వరంగల్ ఆర్డీఓ కృష్ణవేణి, ఏసీపీ నందిరాంనాయక్, తహసీల్దార్లు ఇక్బాల్, బండి నాగేశ్వర్‌రావు, ఇన్‌స్పెక్టర్ మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.





స్వాతంత్ర్య సమరయోధులను సత్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ, పోలీసుల నుంచి వందనం స్వీకరిస్తున్న మంత్రి

**ఉత్తములకు ప్రశంస**

- వివరాలు 8లో▸





స్వాతంత్ర్య సమరయోధులకు నమస్కరిస్తున్న మంత్రి పొంగులేటి, పోలీసుల నుంచి పరేడ్ వందనం స్వీకరిస్తున్న మంత్రి

# సమగ్రాభివృద్ధి, మెరుగైన సేవలే లక్ష్యం



జెండాకు వందనం చేస్తున్న మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ, కార్పొరేటర్లు

- మేయర్ గుండు సుధారాణి
- ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న హనుమకొండ, వరంగల్ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు

**వరంగల్ అర్బన్:** వరంగల్ మహా నగర సమగ్రాభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని మేయర్ గుండు సుధారాణి అన్నారు. గురువారం 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయ ఆవరణలో వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. మేయర్ గుండు సుధారాణి మువ్వన్నెల జెండాను ఎగురవేసి, వందనం సమర్పించారు. ఈసందర్భంగా ఉత్తమ సేవలందించిన 99 మంది అధికారులు, ఉద్యోగులకు మేయర్, కమిషనర్లు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, డిప్యూటీ మేయర్ రిజ్వానా శమీమ్, కార్పొరేటర్లు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లోని టౌన్ హాల్ ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ జెండాను మేయర్ ఆవిష్కరించారు.

**జిల్లా కోర్టు ప్రాంగణంలో..**

**హన్మకొండ కల్చరల్:** 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వరంగల్ కోర్టు ప్రాంగణంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు నిర్మలా గీతాంబ, రమేశ్‌బాబు జాతీయజెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగించారు.

# కలెక్టరేట్లలో ఘనంగా వేడుకలు

జెండాను ఆవిష్కరించిన హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు





ఆయా కలెక్టరేట్లలో జాతీయ జెండాలను ఆవిష్కరిస్తున్న హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు ప్రావీణ్య, సత్య శారద

**హన్మకొండ అర్బన్/కాళోజీ సెంటర్:** హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్‌ల ప్రాంగణంలో కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారద గురువారం వేర్వేరుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈసందర్భంగా విద్యార్థులు జాతీయ గీతాలపనతో కలెక్టర్లకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్లు అధికారులకు, సిబ్బంది, విద్యార్థులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో హనుమకొండ, వరంగల్ అదనపు కలెక్టర్లు వెంకటరెడ్డి, సంధ్యారాణి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పోరాట స్ఫూర్తిని చాటేలా ఫొటో ఎగ్జిబిషన్

- హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య
- కేంద్ర సమాచార శాఖ ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

**హన్మకొండ:** కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ స్వాతంత్ర్య సమరయోధుల పోరాట స్ఫూర్తిని చాటి చెప్పేలా ఉందని హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య ప్రశంసించారు. హనుమకొండ కిషన్‌పురలోని గీతాంజలి డిగ్రీ కళాశాలలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి శ్రీధర్ సూరునేని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల ఫొటో ఎగ్జిబిషన్‌ను గురువారం హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య ప్రారంభించారు. ఇందులో ప్రదర్శించిన స్వాతంత్ర్య సమయరయోధుల అరుదైన చిత్రాలను వీక్షించారు. ఈసందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వాల్ పెయింటింగ్, వ్యాసరచన, గ్రూప్ డ్యాన్స్, సోలో డ్యాన్స్ సహా ఇతర పోటీల విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. శుక్రవారం కొనసాగే ఫొటో ఎగ్జిబిషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో ఎయిర్‌ఫోర్స్ ఫస్ట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

# మూడో విడతలో రూ.735.27 కోట్ల రుణ మాఫీ



**హన్మకొండ:** ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడో విడత రుణమాఫీ కింద రూ.2 లక్షల్లోపు రైతులకు రూ.735,27,34,584 లబ్ధి చేకూరనుంది. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతల్లో రూ.లక్షన్నరలోపు రుణ మాఫీ చేసింది. గురువారం మూడో విడతలో భాగంగా హనుమకొండ జిల్లాలో మాఫీ అయిన ఖాతాలు 9,506 ఉండగా.. 7,451 కుటుంబాలకు రూ.122,39,62,799 రుణం మాఫీ కానుంది. వరంగల్ జిల్లాలో మాఫీ అయిన ఖాతాలు 9,378 ఉండగా.. 6,843 కుటుంబాలకు రూ.112,51,00,005 రుణం మాఫీ కానుంది.

## కరెంట్ ఎప్పుడొస్తుంది సార్ అని అడిగితే..

- విద్యుత్ ఏఈ , సబ్ ఇంజనీర్ బూతుల పర్వం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్

కాశిబుగ్గ: కాశిబుగ్గలో కరెంట్ ఎందుకు పోయింది.. ఎప్పుడోస్తది సార్ అని విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఓ క్యాజ్‌వల్ కార్మికుడు ఫోన్‌లో అడగగా 'నీకు నేను సమాధానం చెప్పాలా' అంటూ ఓ సబ్ స్టేషన్ ఏఈ బూతులతో ఫైరయ్యాడు. గురువారం కాశిబుగ్గలో జరిగిన ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. కొత్తపేటకు చెందిన కరుణాకర్‌రెడ్డి ఆరెపల్లి సబ్‌స్టేషన్‌లో క్యాజువల్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. దుస్తులు కొనుగోలు నిమిత్తం కాశిబుగ్గకు రాగా కరెంట్ పోయిందని ఆ షాపు నిర్వాహకులు చెప్పారు. దీంతో కరుణాకర్‌రెడ్డి నేను అడిగి తెలుసుకుంటానని ఫోన్‌లో మిల్స్ కాలనీ సబ్‌స్టేషన్ ఏఈకి కాల్ చేశాడు. దీంతో ఏఈ 'నువ్వు నాకు కాల్ చేస్తావా? కాంట్రాక్ట్ లేబర్‌వి.. నీకు నేను సమాధానం చెప్పాలా' అంటూ బూతులు తిట్టాడు. దీంతో కరుణాకర్‌రెడ్డి కూడా ఏఈపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ విషయం ఏఈ.. గొర్రెకుంటలోని సబ్ ఇంజనీర్‌కు చెప్పడంతో ఆయన, ఏఈ.. మళ్లీ కరుణాకర్‌రెడ్డికి ఫోన్ చేసి ఓ అధికారితో అలా మాట్లాడుతావా అంటూ ఫోన్‌లో బూతులు తిడుతూ బెరింపులకు దిగారు. దీనికి కరుణాకర్‌రెడ్డి నేను కరెంట్ విషయం గురించి అడిగితే అధికారి బూతులు తిడతారా? సామాన్యులకు సమాధానం చెప్పరా అంటూ వాగ్వాదం చేశారు. దీనికి ఏఈ, సబ్ ఇంజనీర్ నువ్వు ఎక్కడ ఉన్నావో చెప్పు నీ అంతు చూస్తామని బెదిరింపులకు దిగిన మాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈఘటన బయటకు రావడంతో నగరవాసులు కూడా తాము కరెంట్ వాళ్లకు ఫోన్ చేస్తే సరిగా సమాధానం చెప్పడం లేదని పేర్కొంటున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.



# ఉత్తములకు ప్రశంస పత్రాలు



రాష్ట్ర అటవీశాఖ మంత్రి కొండా సురేఖ, కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్‌కిశోర్‌ఝూ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న జిల్లా రెవెన్యూ అధికారి వై.వీ.గణేశ్

వరంగల్, హనుమకొండ జిల్లాల్లో గురువారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ తో కలిసి వేడుకల ముఖ్య అతిథులు, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ.. వివిధ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి ప్రశంస పత్రాలను అందించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్లు, హన్మకొండ, వరంగల్



సురేశ్‌బాబు, ఆర్ అండ్ బీ అధికారి; కె.మనోహర్, ఈఈ ఆర్ అండ్ బీ; రాంరెడ్డి, బీసీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ ఆఫీసర్; కె.నాగపద్మజ, డీఆర్‌డీఓ



కృష్ణవేణి, పీఎస్ పెద్దపెండ్యాల; కె.సత్యనారాయణ, ఏఓ, కలెక్టరేట్; ప్రసాద్, సూపరింటెండెంట్ కలెక్టరేట్; రాజేశ్, సీనియర్ అసిస్టెంట్, కలెక్టరేట్; మురళీ కృష్ణ, సీనియర్ అసిస్టెంట్; ఎండీ.సైఫ్ ఉల్లా, ఆఫీస్ సబార్డినేట్; విజయ్‌కుమార్, తహసీల్దార్; భావుసింగ్, తహసీల్దార్; విరలేశ్వర్, నాయబ్ తహసీల్దార్; కె.శేఖర్, ఆఫీస్ సబార్డినేట్, ఆర్డీఓ; రవీందర్ డిప్యూటీ కమిషనర్; రాజేశ్, సీఎంహెచ్ఓ, కార్పొరేషన్



ఎం.జితేందర్‌రెడ్డి, ఏసీపీ, సీఎస్బీ; రామకృష్ణ స్వామి, ఏఓ సీపీఓ వరంగల్; మధుసూదన్, ఏసీపీ, టాస్క్‌ఫోర్స్; వెంకటేశ్వర్లు, డీపీఆర్వో; శంకర్‌లింగం, డీఎఫ్ఓ; సుగుణాకర్‌రావు, లైన్ ఇన్‌స్పెక్టర్; రాజేశ్, సూపరింటెండెంట్, అగ్రికల్చర్; నాగమణి, అసిస్టెంట్ డైరెక్టర్, వెటర్నరీ; ఎన్.రమేశ్ డీఆర్డీఏ; సుబ్రహ్మణ్యేశ్వర్ రావు, ఎన్పీడీసీఎల్ ఏడీఈ; టి.మధులిక, హార్టికల్చర్ ఆఫీసర్; ప్రవీణ్‌చంద్ర, ఎస్ఈ



వరంగల్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకుంటున్న డీటీడీఓ సౌజన్య



డి.వాసంతి డీఈఓ; నందిరాంనాయక్ ఏసీపీ వరంగల్; డి.అశ్విని, సైంటిస్ట్ అగ్రికల్చర్ వర్సిటీ; అశోక్, మేయర్ సీసీ; పి.సత్యనారాయణ ఏసీపీ ట్రాఫిక్ వరంగల్; పి.రమేశ్, ఇన్‌స్పెక్టర్ ఏనుమాముల; పి.శ్రీకాంత్ ఎస్సై ఏనుమాముల; బి.వెంకన్న ఎస్సై ఇంతేజార్‌గంజ్; కె.భాస్కర్, హెచ్‌సీ షీటీం వరంగల్

వెంకటరమణ, డీఎంహెచ్ఓ



ఎండి ఖాలీద్‌అలీ, సీఓ మెప్మా; పి.జయషీల్, టైపిస్ట్ జిల్లా అగ్రికల్చర్ ఆఫీస్; ఎస్.అనూష, ఏఈ పీఆర్; శ్రీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ఇండస్ట్రీస్; శ్రీకాంత్, ఏఈ ఆర్అండ్‌బీ; శ్రీకాంత్‌బాబు, హార్టికల్చర్ సూపరింటెండెంట్; బి.లక్ష్మి, ఏపీఓ, డీఆర్‌డీఏ; జి.సురేశ్ సీటీఏ డీఆర్‌డీఏ; మణి ఏఎస్సై, మట్టెవాడ ట్రాఫిక్; వి.వేణు, హోంగార్డు గీసుకొండ; ఎ.సురేశ్, హెచ్‌సీ ఇంతేజార్‌గంజ్



## మేలిమి ఆశ చూపి.. నకిలీ బంగారం అంటగట్టి

- డబ్బులు దండుకుని ఉడాయించిన వ్యక్తులకు దేహశుద్ధి
- పోలీసులకు అప్పగింత



ఉడాయించిన ఇద్దరిని (కూర్చున్న వారు) ప్రశ్నిస్తున్న బాధితుడు

బయ్యారం: మాయమాటలతో మేలిమి చూపి..ఆ తరువాత నకిలీ బంగారం కుదవపెట్టి డబ్బులు తీసుకున్న ఇద్దరు వ్యక్తులకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన గురువారం బయ్యారంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కురవి మండలం రాజోలుకు చెందిన కలకోటి రాము అదే గ్రామంలో బాలా జీ సూపర్‌మార్కెట్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మూడునెలల క్రితం రాజస్తాన్‌కు చెందిన గణేశ్, క్రాంతిలాల్, తదితరులు సూపర్‌మార్కెట్‌కు వెళ్లి సరుకులు కొనుగోలు చేశారు. ఈ సమయంలో తమకు బంగారం గొలుసు దొరికిందని రాముకు చెప్పి గొలుసులోని చిన్న ముక్క ఇవ్వగా అతను మహబూబాబాద్‌లో నాణ్యత పరీక్షించుకుని బంగారంగా నిర్ధారించుకున్నాడు. ఆ తరువాత కొన్ని రోజులకు గొలుసుతో రాము వద్దకు వచ్చిన రాజస్తాన్ వాసులు తమకు డబ్బులు అవసరం ఉన్నాయని, రూ. రెండు లక్షలు ఇస్తే సుమారు 8 తులాల బంగారం గొలుసు ఇస్తామని చెప్పారు. దీంతో రాము వారికి డబ్బులు ఇచ్చి గొలుసు తీసుకున్నాడు. అనంతరం గొలుసును ముత్తూట్ ఫైనాన్స్‌లో తనఖా పెట్టి డబ్బులు తీసుకుందామని రాము మహబూబాబాద్ వెళ్లగా అక్కడ పరీక్షించిన నిర్వాహకులు నకిలీ బంగారంగా గుర్తించారు. దీంతో రాము తనకు చిన్న బంగారం వస్తువు అందించి నకిలీ గొలుసు ఇచ్చి మోసగించిన ట్లు గుర్తించి వారి ఆచూకీ కోసం గాలిస్తున్నాడు. ఈ క్రమంలో బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో గణేశ్, క్రాంతిలాల్ సంచరిస్తున్నట్లు సమాచారం తెలుసుకుని వారిని పట్టుకున్నారు. ఈ సమయంలో కొందరు వ్యక్తులు వారికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.

## వరంగల్ రీజియన్‌ను అగ్రగామిగా నిలపాలి

- ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను



జాతీయ పతాకం ఆవిష్కరించి మాట్లాడుతున్న ఆర్ఎం డి.విజయభాను

హన్మకొండ: లాభాల్లో వరంగల్ రీజియన్‌ను అగ్రగామిగా నిలపాలని ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయభాను అన్నారు. గురువారం హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణంతో బస్సుల్లో రద్దీ పెరిగిందన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి ఉద్యోగులు కష్టపడుతున్నారన్నారు. ప్రయాణికుల ఆదరాభిమానాలు చూరగొంటూ కార్పొరేషన్‌లో వరంగల్ రీజియన్‌ను ఆదాయంలో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. వరంగల్-2 డిపో అసిస్టెంట్ మేనేజర్ జ్యోత్స్న, అసిస్టెంట్ మెకానికల్ ఈ.అమల, వరంగల్-2 డ్రైవర్ బి.వెంకన్న, వరంగల్-1 డిపో డ్రైవర్ ఎ.రమేశ్, మహబూబాబాద్ డ్రైవర్ వి.శ్రీనివాస్, హనుమకొండ డిపో కండక్టర్ జి.సరళాదేవి, మెకానిక్ జి.దేవేందర్‌కు ప్రశంస పత్రాలు అందించారు. డిప్యూటీ ఆర్ఎంలు కె.భానుకిరణ్, జి.మాధవరావు, అకౌంట్స్ ఆఫీసర్ ఎ.రవీందర్, పర్సనల్ ఆఫీసర్ రామ్మోహన్ రావు, ఈఈ భాస్కర్ పాల్గొన్నారు.

## ఇంటి భోజనానికి..
# భారత సర్కారు గుర్తింపు

**నర్సంపేటలోని ఉప్పలయ్య హోటల్‌కు జాతీయ ప్రశంస**



నర్సంపేట పట్టణంలోని ఉప్పలయ్య హోటల్




ఉప్పలయ్య హోటల్‌కు వచ్చిన సర్టిఫికెట్

నర్సంపేట: ఫైవ్ స్టార్ హోటళ్లు ఎన్ని ఉన్నా.. రుచికరమైన ఇంటి భోజనం ఎక్కడ దొరికితే అక్కడికి భోజన ప్రియులు పరుగెత్తుతారు. అటువంటి ఇంటి భోజనం లభిస్తున్న ఓ చిన్న హోటల్‌కు భారత సర్కారు గుర్తింపు లభించింది. ఇప్పుడు ఆ హోటల్ పేరు సామాజిక మాధ్యమాల్లో మార్మోగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో ముప్పై సంవత్సరాల క్రితం ఉప్పలయ్య తన ఇంట్లోనే (ఉప్పలయ్య హోటల్) మెస్‌ను ప్రారంభించారు. తక్కువ ధరకే ఇంటి భోజనాన్ని అందించడంతో భోజన ప్రియులు విపరీతంగా వచ్చేవారు. కొంతకాలం తరువాత ఉప్పలయ్య అనారోగ్యంతో చనిపోయారు. ఆ తర్వాత హోటల్‌ను తన కుమారుడు శ్రీనివాస్ కుటుంబ సభ్యులు నడిపిస్తూ వస్తున్నారు. కుటుంబ సభ్యులు మొత్తం హోటల్ నిర్వహణ చూసుకుంటున్నారు. రుచిలో ఏ మాత్రం తేడా రాకుండా తన తండ్రి ఏ విధంగా లాభాపేక్ష లేకుండా నడిపించాడో కుమారుడు శ్రీనివాస్ కూడా అలాగే నడిపిస్తున్నాడు. ఈ హోటల్‌కు రోజూ సుమారు 200మందికిపైగా వచ్చి భోజనం చేస్తున్నారంటే రుచి ఎలా ఉంటుందో మనం అర్థం చేసుకోవచ్చు.

**జాతీయ గుర్తింపు ఎలా వచ్చిందంటే..**

ఈ హోటల్‌లో వెజ్, నాన్‌వెజ్ తక్కువ ధరలో అందిస్తున్నారు. వినియోగదారుడి ధరకు అందుబాటులో ఉండేలా నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు తెలుసుకున్న భారత ప్రభుత్వం(మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ ప్రోగ్రాం ఇంప్లిమెంటేషన్) నుంచి రీజనల్ హెడ్ ఆఫీస్ హైదరాబాద్ సభ్యులు రెండు నెలల కిందట ఈ హోటల్‌కు వచ్చి భోజనం చేసి బాగుందని చెప్పి వెళ్లిపోయారు. ఈ నెల 12(సోమవారం)న మరోసారి హోటల్‌కు వచ్చి మీ హోటల్‌కు అవార్డు వచ్చిందని చెప్పి శ్రీనివాస్‌కు సర్టిఫికెట్ అందజేశారు. ఇదే నాణ్యతను కొనసాగిస్తూ భోజన ప్రియులకు నాణ్యమైన, రుచికర భోజనాన్ని అందించాలని అభినందించారు.

**మంచి పేరు కోసమే..**



హోటల్ పెట్టినప్పటినుంచి మా ఇంట్లోనే భోజనాలు ఏర్పాటు చేసేవాళ్లం. నాణ్యతతోపాటు తక్కువ ధరలకు భోజనం అందిస్తూ వచ్చాం. హోటల్‌కు వచ్చే వాళ్లకు మంచి రుచితో కూడిన భోజనాలు అందించాలని మా నాన్న ఉప్పలయ్య చెప్పేవారు. ఆయన అదే విధంగా చాలా సంవత్సరాలు నడిపించారు. నాన్న చూపిన బాటలోనే హోటల్‌ను నడిపిస్తున్నాం. దీని ద్వారానే జాతీయ స్థాయి అవార్డు లభించింది..పెద్ద పెద్ద హోటళ్లకు దక్కని అవార్డు మా హోటల్‌కు లభించడం సంతోషకరంగా ఉంది.

- జల్ల శ్రీనివాస్, ఉప్పలయ్య హోటల్ నిర్వాహకుడు, నర్సంపేట

## ప్రాణాపాయం నుంచి గట్టెక్కారు..

- కారు డోర్ లాక్.. వాహనంలోనే చిన్నారులు
- అర్ధగంటకు పైగా భయానక వాతావరణం
- మెకానిక్ సాయంతో తెరుచుకున్న డోర్‌లు
- ఊపిరిపీల్చుకున్న తల్లిదండ్రులు



సుబేదారిలో కారులో ఉన్న ఇద్దరు పిల్లలను బయటకు తీస్తున్న స్థానికులు

హన్మకొండ అర్బన్: తల్లిదండ్రులు తమ ఇద్దరు చిన్నారులను కారులో వదిలి మందుల కొనుగోలు నిమిత్తం మెడికల్ షాపునకు వెళ్లారు. అనుహ్యంగా కారు డోర్ లాక్ అయింది. దీంతో అర్ధగంటకు పైగా భయానక వాతావరణం నెలకొంది. కొత్తూరు జెండాకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శ్రీకాంత్, శ్రావణి దంపతులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను తిలకించడానికి గురువారం కారులో పుర వీధుల్లోకి వచ్చారు. జెండా వందనాలు చూసిన అనంతరం సుబేదారిలోని 'ఏ టు జెడ్' మెడికల్ షాపులో మందులు కొనడం కోసం కారులో నుంచి దిగారు. ఆ సమయంలో కారులో ఉన్న తాళంతో పిల్లలు డోర్ లాక్ చేశారు. బయటకు వచ్చిన తల్లిదండ్రులు కారు డోర్ తెరవడానికి యత్నించి విఫలమయ్యారు. లోపల ఉన్న పిల్లలకు ఊపిరి తీసుకోవడం కష్టమవుతుందని ఆందోళన చెంది వెంటనే మెకానిక్‌కు ఫోన్ చేస్తూ స్థానికుల సహకారంతో కారు డోర్ తెరవడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలో అర్ధగంట తర్వాత మెకానిక్ వచ్చి కారు డోర్‌లు తెరవడంతో పిల్లలు బయటకు వచ్చారు. దీంతో స్థానికులతోపాటు తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

## పోడుకు యత్నించిన ఇద్దరిపై కేసు నమోదు

భూపాలపల్లి : అటవీ భూమిని నరికి పోడు చేసేందుకు యత్నించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు అటవీశాఖ భూపాలపల్లి రేంజ్ ఆఫీసర్ బన్న నరేశ్ తెలిపారు. ఎఫ్ఆర్ఓ కథనం ప్రకారం.. రాంపూర్ నార్త్ 4వ బీట్‌లోని రక్షిత అటవీ ప్రాంతంలో ఒకరు చెట్లు నరుకుతున్నట్లు గురువారం సమాచారం అందింది. ఈ మేరకు ఘటనా స్థలికి చేరుకుని చెట్లు నరుకుతున్న సింగరవేణి నరేందర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడిని విచారించగా తాను కూలీ పని నిమిత్తం వచ్చానని, సింగరేణి భూపాలపల్లి ఏరియాలో పని చేసే టి. రఘోత్తంరెడ్డి 20 ఎకరాల భూమి చదును చేసేందుకు రూ. 40 వేలు ఇస్తానని చెప్పినట్లు తెలిపాడన్నారు. దీంతో రఘోత్తంరెడ్డిని కూడా అదుపులోకి తీసుకుని విచారించగా, తాను నాగారం చెందిన మధ్యవర్తుల ద్వారా ఆ భూమిని కొనుగోలు చేశానని వెల్లడించారన్నారు. దీంతో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్ఓ వెల్లడించారు. అటవీ భూమిని ఎవరూ కొనుగోలు చేసి మోసపోవద్దని, అడవిలో చెట్లు నరికినా, పోడుకు ప్రయత్నించినా చర్యలు తప్పవని ఎఫ్ఆర్ఓ నరేశ్ హెచ్చరించారు.

## తన వద్దకు అమ్మమ్మ రావడం లేదని..

- మనస్తాపంతో యువతి ఆత్మహత్య
- భీమదేవరపల్లిలో ఘటన



నిఖిత మృతదేహం

ఎల్కతుర్తి: తన వద్దకు అమ్మమ్మ రావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం భీమదేవరపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మారుపాటి నిఖిత(22) కేయూలో పీజీ చదువుతుంది. నిఖితకు అమ్మమ్మ అంటే చాలా ఇష్టం. ఈ క్రమంలో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిర్సపల్లికి చెందిన నిఖిత అమ్మమ్మ కొంతకాలంగా నిఖిత ఇంటికి రావడం లేదు. ఈ ఘటనపై అమ్మమ్మ ఇంటికి ఎందుకు రావడం లేదని కుటుంబీకులను అడుగుతూ బాధపడుతుండేది. ఈ క్రమంలో ఈనెల 14న పరీక్ష రాసేందుకు వెళ్లిన నిఖిత. సాయంత్రం ఇంటికి చేరుకుంది. రాత్రి తండ్రి మహేందర్‌రెడ్డి, తల్లి సుమతి, అక్క ప్రియదర్శినితో కలిసి భోజనం చేసిన అనంతరం నిద్రించడానికి తన రూమ్‌లోకి వెళ్లింది. తెల్లారినా నిఖిత నిద్ర నుంచి లేవక పోవడంతో తండ్రి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో రూమ్‌కు వెళ్లి తలుపు కొట్టగా ఎంతకూ తీయలేదు. మహేందర్ రెడ్డి తన స్నేహితుడితో కలిసి బలవంతంగా తలుపు తీయగా నిఖిత ఉరేసుకుని కనిపించింది. ఈ ఘటనపై మహేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్ కుమార్.. మహేందర్‌రెడ్డి ఇంటికి చేరుకుని కుటుంబీకులను ఓదార్చారు.

**కుటుంబ కలహాలతో యువకుడు..**

చిల్పూరు: కుటుంబ కలహాలతో మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కలకోళ వెంకటేశ్(36) హైదరాబాద్‌లోని ఇంట్లో గురువారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేశ్ మృతితో కుటుంబంతోపాటు కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య జ్యోతి, ముగ్గురు కుమారులు ఉన్నారు.